క్లుప్తంగా

కాపులుప్పాడ పవర్‌ప్లాంట్‌కు నక్కపల్లి డ్రైవేస్ట్



నక్కపల్లి డ్రైవేస్ట్‌ను కాపులుప్పాడ తరలిస్తున్న దృశ్యం

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలో సేకరించిన డ్రైవేస్ట్‌ను కాకినాడ జిల్లా కాపులుప్పాడ వద్ద ఉన్న పవర్‌ప్లాంట్‌కు పంపిస్తున్నట్లు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. శుక్రవారం జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లారీల్లో ఈ డ్రైవేస్ట్‌ను తరలించారు. తడి, పొడి చెత్త సేకరణలో భాగంగా నక్కపల్లిలో సేకరించిన డ్రైవేస్ట్‌ను బోదిగల్లం రోడ్డులో ఉన్న సంపద తయారీ కేంద్రానికి తరలించారు. అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేసి నిల్వ చేశారు. ఇలా వేరు చేసిన డ్రైవేస్ట్‌ను కాపులుప్పాడ వద్ద ఉన్న పవర్ ప్లాంట్‌కు పంపించాలని జిల్లా అధికారులు ఆదేశించారని ఎంపీడీవో తెలిపారు. తరలింపును ఉప సర్పంచ్ వీసం రాజు, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ శ్రీను, కార్యదర్శి మూర్తి పర్యవేక్షించారు.

లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్

మునగపాక: విద్యార్థులు ఓ లక్ష్యంతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. పదో తరగతిలో మునగపాక మండల టాపర్‌గా నిలిచిన లక్ష్మీ గణేష్‌తో పాటు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన బుదిరెడ్డి రేణుక, టెక్కలి భాగ్యలక్ష్మిలను శుక్రవారం ఆయన అభినందించారు. ఏకాగ్రతతో చదువుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీఎంసీ చైర్మన్ ఆడారి సూర్యచంద్ర రావు, దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, ఆడారి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు



నిర్మానుష్యంగా ఉన్న కోటవురట్ల-రేవుపోలవరం మెయిన్ రోడ్డు

కోటవురట్ల: భానుడి భగభగలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే సూరీడు ప్రతాపం చూపిస్తున్నాడు. మధ్యాహ్నం 12 గంటలైతే చాలు రహదారులన్నీ ఖాళీ అవుతున్నాయి. జనాలు ఇళ్లకే పరిమితం కావడంతో ప్రధాన రహదారులు సైతం నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం 5 గంటలైనా భానుడి భగభగలు ఏమాత్రం తగ్గ డం లేదు. మండే ఎండలకు ఉక్కపోత తోడవ్వడంతో చిన్నారులు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు.

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పూర్తి

కశింకోట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తి అయిందని, రైతులకు త్వరితగతిన పారదర్శకమైన సేవలందుతాయని జిల్లా సహకార శాఖ అధికారి ఎ.ప్రేమ స్వరూప రాణి తెలిపారు. ఈ-పీఏసీఎస్ ఆడిట్ నిర్వహించేందుకు ఆడిట్ మాడ్యుల్‌పై సహకార శాఖ ఆడిటర్లు, చార్టెర్డ్ అకౌంటెంట్లకు కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో ఆచరణాత్మక శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంప్యూటరీకరణలో జిల్లా రాష్ట్రంలో నాలుగవ స్థానంలో నిలిచిందన్నారు. ఆడిటర్లంతా పీఏసీఎస్ ఆడిట్‌ను ఈ-ఆడిట్ ప్రక్రియలో పూర్తి చేయాలన్నారు. యలమంచిలి డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి పి.ఎన్.ఎల్. కిరణ్‌కుమారి, అనకాపల్లి డీడీఎం శ్రీవిద్య, సహకార శాఖ ఆడిటర్లు, చార్టెర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి కల్యాణం



సత్యనారాయణస్వామి కల్యాణంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళీ దంపతులు


అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద గల సత్యనారాయణ, సూర్యనారాయణ స్వామి దేవాలయంలో వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని రమా సమేత సత్యనారాయణస్వామి కల్యాణాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచి స్వామివారికి సుప్రభాతసేవ, విష్ణు సహస్రనామ అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళీ దంపతులు కల్యాణం జరిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల నిర్వాకం.. ఆయకట్టు భూములకు శాపం

పోలవరం కాలువ పనులు చేసే కాంట్రాక్టర్ల నిర్వాకం పలు గ్రామాల్లో చెరువు ఆయకట్టు భూములకు శాపంగా మారింది. కాలువ తవ్వకాల్లో వచ్చిన మట్టితో నీటి మార్గాలను, గెడ్డలను కప్పివేయడంతో దిగువ ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లోకి నీరు రాకుండా పోలవరం కాలువలోనే ఉండిపోతోంది. గత ఏడేళ్ల నుంచి ఈ సమస్య ఉన్నా నీటి పారుదల శాఖ అధికారులు పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదంటూ ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు.



గెడ్డను మూసివేస్తూ దగ్గరగా వేసిన మట్టి



జగన్నాథపురం సమీపంలో గెడ్డ ద్వారా వర్షపునీరు చెరువుల్లోకి వెళ్లకుండా అడ్డంగా వేసిన పోలవరం మట్టి



నక్కపల్లి: పోలవరం కాలువకు ఆనుకుని జగన్నాథపురం, రమణయ్యపేట, గుల్లిపాడు, దోసలపాడు, చినదొడ్డిగల్లు, డొంకాడ, సీతంపాలెం, పెద దొడ్డిగల్లు, తదితర గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో ఉన్న చెరువులకు వర్షాలు పడిన సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరే ఆధారం.2004లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో పోలవరం ఎడమ కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. కాలువ నిర్మాణపు పనులను అప్పటి టీడీపీ నాయకుడు నామా నాగేశ్వరరావుకు చెందిన మధుకాన్ సంస్థ దక్కించుకుంది. కాలువ నిర్మాణంలో వచ్చిన మట్టిని ఎగువ ప్రాంతాల నుంచి దిగువ ప్రాంతాలకు వర్షపు నీరు వెళ్లే గెడ్డలు, వాగులు, పిల్ల కాలువలపై వేసి కప్పేశారు. దీంతో ఎగువ ప్రాంతాల్లోను, కొండల్లో పడిన వర్షపు నీరు దిగువ ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లోకి వెళ్లకుండా పోలవరం కాలువలోనే పడుతోంది. ఈ సమస్యపై గతంలో రైతులు ఆందోళన చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. రెండేళ్ల పాటు వర్షపునీరు యథావిధిగా చేరింది. తర్వాత సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

భారీ వర్షాలు పడిన సమయంలో కాలువ గట్టుపై వేసిన మట్టి కరిగి గెడ్డలు, వాగుల్లో పడి నీటి మార్గాలు మూసుకుపోయాయి. అప్పటి నుంచి అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. గెడ్డలకు ఇరువైపులా ఉన్న బెర్మ్‌ల చివరి వరకు తవ్వేయడంతో గెడ్డలు, వాగులు కనుమరుగయ్యాయి. ప్రధానంగా పోలవరం కాలువను ఆనుకుని ఉన్న జగన్నాథపురంలో నేరెళ్లమాని చెరువు, పెద్ద చెరువుల్లోకి వర్షపునీరు చేరకుండా పోలవరం కాలువలోనే ఉండిపోతోందంటూ ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు చెరువుల కింద సుమారు 400 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసినా చెరువుల్లో నీరు లేక వర్షాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. గతేడాది ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లడంతో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి మార్గాలు పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది మళ్లీ అదే సమస్య ఎదురైందని రైతులు చెబుతున్నారు. జగన్నాథపురంలోనే కాకుండా రమణయ్యపేట, గుల్లిపాడు, చినదొడ్డిగల్లు, ఉద్దండపురం గ్రామాల్లో ఉన్న పలు చెరువులకూ ఇదే సమస్య ఉందని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యేలోపు ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. గెడ్డలు, వాగులపై పోలవరం కాంట్రాక్టర్లు వేసిన మట్టిని పూర్తిగా తొలగించి వెడల్పు చేసి, యథావిధిగా పునరుద్ధరించాలని లేదా ప్రధాన కాలువకు పిల్ల కాలువలు ఏర్పాటు చేసి చెరువుల్లోకి నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యకు శాశ్వత పరిష్కారం అవసరం



మధుకాన్ కాంట్రాక్టర్ల నిర్వాకం కారణంగా జగన్నాథపురంలో నేరెళ్లమాని చెరువు, పెద్ద చెరువుల్లోకి గత ఏడేళ్ల నుంచి సరిగ్గా వర్షపు నీరు చేరడం లేదు. కాలువ తవ్వకాల్లో వచ్చిన మట్టిని గెడ్డలు, వాగుల్లో వేసి కప్పేశారు. గతేడాది ఎమ్మెల్యే బాబూరావు, వీసం రామకృష్ణల దృష్టికి తీసుకెళ్లి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించుకున్నాం. వర్షం పడితే చెరువులో నీరు చేరితేనే ఆయకట్టు భూముల్లో వరి సాగు చేసే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది అడపాదడపా పడిన వర్షాలకు గెడ్డల ద్వారా చుక్కనీరు రావడం లేదు. ఇరిగేషన్ అధికారుల స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– కరణం ఈశ్వరరావు, రైతు, జగన్నాథపురం

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ విభాగ ప్రతినిధి రమ్య

మునగపాక: కిషోర బాలికలకు ఆరోగ్య అలవాట్లపై అవగాహన అవసరమని జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి ఎల్‌వీ రమ్య అన్నారు. మండలంలోని గణపర్తిలో శుక్రవారం కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిషోర బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు లైంగిక దాడులపై అవగాహన కల్పించాలన్నారు. బాల కార్మికులతో వెట్టి చాకిరీ చేయకుండా చూడాలన్నారు. గ్రామాల్లో 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వయసున్న బాలికలతో సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సర్పంచ్ చదరం నాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి షణ్ముక, మహిళా కార్యదర్శి లీలారాణి, అంగన్‌వాడీ టీచర్ గంగాభవాని, వీవోఏ సుధామణి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాక గ్రామానికి చెందిన పెంటకోట తాతారావు(41) ఈ నెల 6వ తేదీ ఉదయం నుంచి కనిపించడం లేదని ఆయన సోదరుడు గిరిపతి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 6వ తేదీ ఉదయం గ్రామ సమీపంలో ఉన్న పశువుల పాక వద్దకు వెళ్లిన తాతారావు ఆ తర్వాత ఇంటికి రాలేదు. దీంతో చుట్టు పక్కల ప్రాంతాలు, పరిసర గ్రామాల్లో కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాతారావుకు మతిస్థిమితం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సంపద తయారీ కేంద్రాలతో అదనపు ఆదాయం

అచ్యుతాపురం రూరల్ : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో గ్రామాలకు అదనపు ఆదాయం లభిస్తుందని డీపీవో శిరీష తెలిపారు. శుక్రవారం వెదురువాడలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరుగా ప్రజల నుంచి సేకరించాలన్నారు. తడి చెత్తతో వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు. ఈ ఎరువుతో బంగారం లాంటి పంటలు పండించ వచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీరామమూర్తి నాయుడు, సెక్రటరీ చిట్టి రమణ, పాల్గొన్నారు.



వెదురువాడలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీష

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకర పంటలు



ప్రకృతి సేద్యంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



రైతులను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

ఎస్.రాయవరం: ప్రకృతి సేద్యంతో వ్యవసాయం సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు రావడమే కాకుండా ఆరోగ్యకరమైన ఫలాలు వస్తాయని తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపురం శివారు గోకులపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సాగు మెలకువలు వివరించారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు ఉపయోగించి పంటలు సాగు చేయాలని సర్పంచ్ సూచించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ రైతులను ఘనంగా సత్కరించారు. పూర్వం పంటలకు సాగు ఉపయోగించే ఎరువులను వారి మాటల్లో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ విస్తరణాధికారి ధనరాజ్, ఎంపీటీసీ నాగబోయిన శ్రీనివాసరావు, గ్రామ ఉప సర్పంచ్ అద్దేపల్లి బాబూరావు, స్థానిక నాయకుడు లక్ష్మీనారాయణ, వెలుగు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వివాదాలను స్థానికంగా పరిష్కరించుకోవాలి

మునగపాక: గ్రామాల్లో భూముల సరిహద్దు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం మండల అధికారుల సమన్వయ సమావేశంలో భాగంగా గతంలో చేసుకున్న దరఖాస్తు చేసుకున్న అర్జీదారులతో మాట్లాడారు. సాధ్యమైనంతలో సమస్యలను స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. స్థానికంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గొడవలకు దిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఏఎస్ఐ దొర, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయంలో అర్జీదారుల సమస్యలు వింటున్న అధికారులు

అభివృద్ధి ప్రణాళిక తయారు చేయండి

పాయకరావుపేట: విజన్-2047పై అధికారులు ప్రణాళిక తయారు చేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి డాక్టర్ శచీదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే 5 ఏళ్లలో గ్రామాల్లో ఏయే పనులు చేపడితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది అనే విషయాలపై అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, వ్యవసాయం, సాగునీరు, ఉద్యానవనం, రోడ్లు, డ్రైనేజీలు, తదితర సమస్యలపై దృష్టి సారించి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఆయాల శాఖల అధికారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ రాజశేఖర్, ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావు, ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి శచీదేవి

20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

నాతవరం : ఈ నెల 20వ తేదీన తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి ఆడిగర్ల రాజు అన్నారు. మండలంలో సరుగుడు గ్రామంలో శుక్రవారం ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఆర్‌ఏలతో కలిసి సమ్మె పోస్టరు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాటంతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కుదించేందుకు కుట్ర చేస్తుందన్నారు. కొత్త కార్మిక చట్టాలు అమల్లోకి వస్తే కార్మికుల హక్కులు ప్రైవేటు కాంట్రాక్టర్ల ఆధీనంలోకి పోతాయని, తక్కువ జీతాలతో వెట్టిచాకిరి చేయాల్సి వస్తుందని, ఉద్యోగ భద్రత ఉండదని హెచ్చరించారు.



పోస్టరు విడుదల చేస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, నాయకులు

పేకాడుతున్న ఆరుగురిపై కేసు

యలమంచిలి రూరల్: మండలంలోని పులపర్తి గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. పేకాడుతున్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ.10,540 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



గణపర్తిలో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మునగపాక: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు హెచ్చరించారు. గణపర్తిలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన పశువుల పాకలను అధికారులు గుర్తించి శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. డీటీ శేషుబాబు, ఆర్ఐ పడాల్ నేతృత్వంలో పాకల తొలగింపు పనులు జరిగాయి.

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం



పాడి రైతులకు సిల్వర్ బేసిన్లు అందిస్తున్న పాల సంఘ అధ్యక్షుడు కాసులుబాబు

మునగపాక: పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నట్టు వెంకటాపురం పాల సంఘం అధ్యక్షుడు సుందరపు కాసులుబాబు పేర్కొన్నారు. వెంకటాపురం పాల సంఘ మొదటి అంతస్తు భవనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం రైతులకు సిల్వర్ బేసిన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా విశాఖ డెయిరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాడి రైతులు పశువుల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, మాజీ సర్పంచ్ కనకప్పారావు, డెయిరీ సివిల్ ఇంజినీర్ వెలగా సురేష్‌కుమార్, జీవో రమణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత

అనకాపల్లి: నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన మహిళా కానిస్టేబుల్ డి.దుర్గాభవాని తల్లి చందక రాధ, పిల్లలకు పోలీస్ భద్రత ఎక్స్‌గ్రేషియా కింద మంజూరైన రూ.4లక్షల చెక్కును ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలకు పోలీసు శాఖ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.



కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న అదనపు ఎస్పీ దేవప్రసాద్

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ మారిశెట్టి వెంకటప్పారావు కోరారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిత్ర లేఖనంలో రాణించడం ద్వారా సృజనాత్మకతను పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. మెదడు పని తీరును మెరుగుపరుస్తుందన్నారు. ఇటువంటి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్న అనకాపల్లి జిల్లా చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ జ్యోతిర్మయి, క్లబ్ కన్వీనర్ బి.ఉమామహేశ్వరరావు, ఆళ్ల మహేశ్వరరావు, పెంటకోట వెంకటరావు, ఆడారి రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



తాము గీసిన చిత్రాలతో విద్యార్థులు

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

పాయకరావుపేట: శ్రీప్రకాష్‌లో 15 రోజులుగా విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. విద్యార్థులకు యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సంగీతం, స్కేటింగ్, కంప్యూటర్ బేసిక్స్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, తదితర ఆటల్లో నిష్ణాతులైన కోచ్‌లతో మెలకువలు నేర్పారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాల్లో నేర్చుకున్న మెలకువలను విద్యార్థులు నిరంతరం కొనసాగించాలని సూచించారు. అనంతరం క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న విజయ్ ప్రకాష్

విస్తృతంగా వాహన తనిఖీలు



బయ్యవరంలో రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



కశింకోటలో వాహనాల తనిఖీ

కశింకోట: పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేసిన నేపథ్యంలో ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు గురువారం అర్ధరాత్రి నుంచి పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ ఎం. శ్రావణి పర్యవేక్షణలో సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది కశింకోట, బయ్యవరం, తాళ్లపాలెం కూడలి ప్రాంతాల్లో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలు కొనసాగుతాయని సీఐ తెలిపారు.

యుద్ధంలో భారత్ విజయం సాధించాలని పూజలు

అనకాపల్లి టౌన్: యుద్ధంలో పాకిస్థాన్‌పై మన దేశం విజయం సాధించాలని గాంధీనగరం వేంకటేశ్వర స్వామి ఆలయంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరావు మాట్లాడుతూ యుద్ధంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో మన సైన్యం పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. యుద్ధం సందర్భంగా మరణించిన భారతీయులకు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఉడా రమేష్ తదితరులు పాల్గొన్నారు.